

# తథాగతుడు

- డా.యల్.కె.సుధాకర్

విషయం అలా ఎలా మలుపు తిరిగిందంటే చెప్పలేనుగానీ... ఉన్నట్టుండి మా వాదనంతా సంప్రదాయాల మీదికి మళ్లింది. కనుమరుగైపోతున్న సంప్రదాయాలూ మాయమైపోతోన్న అనుబంధాల గురించి చర్చ ప్రారంభమైంది. 'డ్రై'గా వుంది. ఎప్పట్లాగే ఓంబాబుగాడు నవ్వేడు. ఎప్పట్లాగే వాడెందుకు నవ్వేడో రంగడికి అర్థంకాలేదు. రంగడికి అర్థం కాలేదన్న సంగతి ఓంబాబుగాడితోబాటూ మా మిత్రబృందం మొత్తానికి పూర్తిగా తెలుసు. దాంతో ఎప్పట్లాగే రంగడు ఉడుక్కున్నాడు. వ్యవహారం కాస్త సీరియస్సయ్యింది.


సరే! సరే! సంప్రదాయాల గొడవ మనకెందుగ్గానీ మంచి కథ చెబుతా వింటానంటే అన్నాను టాపిక్ మారుస్తున్నట్టు.

గోదారొడ్డు... అలల చిరుసవ్వడుల సాయంత్రం. గోదారి మీదుగా అలలపై ఎగురుతూ పోతోన్న పక్షి గుంపులు...లంకల్లోంచి కొబ్బరాకుల గాలి మోసుకొస్తొన్న వింత పరిమళం... గన్నవరం అక్విడెక్టూ... గట్టు మీద మదర్ థెరీస్సాదీ... డొక్కా సీతమ్మగారిదీ విగ్రహాలూ... మా మిత్ర బృందంలో సభ్యుల్లాగా.

అయితే ఇంతటి ఆహ్లాదకర వాతావరణం నేను చెప్పబోయే కథకేమాత్రం పనికిరాదు. సరే! నేను చెప్పడం మొదలెట్టాను.

❖❖❖

కాకినాడ్లో జిల్లా పోలీసు కార్యాలయం ప్రక్కన మెడికల్ కాలేజీ గోడ దగ్గర 'ఫుట్‌పాత్'మీద ఉంటాడతను. ఒక్కడే. ఎప్పటినుంచో లేదా ఎన్నేళ్లనుంచో... ఒక్కడే. పిచ్చోడిలా వుంటాడు కానీ కాదు. ఎలాకాదు అంటే చెప్పడం కష్టం... కానీ కాదు. బహుశా అతడి మొహంలో కళప్రశాంతతో నిండిన కళ అతడిని పిచ్చోడిగా 'డిక్లేర్' చేయనివ్వదనుకుంటూ. ఎవ్వరితోనూ మాట్లాడుతుండగా నేను చూల్లేదు. నిశ్శబ్దంగా, నివురుగప్పుకున్న నిప్పులా వుంటాడు. ప్రమిదలో దీపంలా రెపరెపలాడుతున్నట్టుంటాడు. శిరస్సూ గడ్డమూ చూస్తే ముస్లింలా వుంటాడు. తొడుక్కున్న కోటు చూస్తే కిరస్తానీ వాళ్లా వుంటాడు. లేచి నిలబడ్డప్పుడు పంచెకట్టుతో అచ్చమైన హిందువేననిపిస్తాడు. మొత్తంగా ఒక్కమాటలో... నిజమైన మనిషిలా వుంటాడు. అంటే నా ఉద్దేశ్యం మనిషి ఎలా వుంటే నిండుమనిషో అలా నిర్వచనంలా వుంటాడు,.



ఓ గోనె సంచీ, మరో కుట్లు విప్పదీసిన గోనె పట్టా, ఒక గొడుగూ చిరుగుల బొంతా, ఇవీ అతడి ఆస్థి. అతడు అడుక్కుంటూండగా కూడా నేనెప్పుడూ చూల్లేదు. అసలు తింటాడో లేదో కూడా తెలీదు. తన గోనె సంచీలోంచి ఏవేవో పుస్తకాలు తీసి చదవడం మాత్రం చూశాన్నేను. అప్పుడప్పుడూ దాస్తూనో.

ఇంత వివరణ ఇచ్చాక అసలు నాకు అతడితో సంబంధమేమిటో చెప్పకపోతే పరిపూర్ణత ఉండదు కదా! అందుకే అసలు విషయానికొస్తాను. కాంపిటేటివ్ పరీక్షల పుణ్యమా అని నేను చదూకున్న 'ఆంత్రోపాలజీ' నన్ను మనుషుల్ని పరిశీలించడం దిశగా నడిపింది. ఇంత రద్దీ జీవితంలో అనుక్షణం పరిగెత్తే కాలంలో ఇలా రోడ్డుప్రక్క పేవ్‌మెంట్‌ల మీద ఒక్క కాకినాడలోనే ఏమిటీ ఎక్కడ ఏ పట్టణంలోనయినా ఏ నగరంలోనయినా అది మామూలు దృశ్యమే. అయితే ప్రత్యేకించి నన్నాకర్షించిన సంగతి అతడి మౌనం. పుస్తక పఠనం మీద అతడికి వున్న అపురూపమైన ఆసక్తి. తనకి కేవలం రెండడుగుల దూరంలో ఇన్ని భయోత్పాతాల మధ్యా, ఆందోళనల మధ్యా జీవితం పరుగులు పెడుతోన్నవేళ అతడు మౌనముద్రలో తన తపస్సులో తానుండడం బహుశా నావల్ల కానిదేదో అతడికి చాతనవుతుండడంవల్లననుకుంటా అతడి పట్ల నాలో నాకే ఏదో తెలీని ఆకర్షణ... ఇష్టం.

ప్రతిరోజూ స్పీడుగా నా బైక్‌మీదనో కారులోనో వెళ్తూవెళ్తూ అక్కడికి రాగానే చాలా మామూలుగా (క్యాజువల్‌గా) స్పీడు తగ్గించడం అలవాటయిపోయింది. ఒక్కసారి బ్రేక్ వేసి అతడివేపు చూడడం... అతడి తాలూకూ 'పాజిటివ్ సర్క్యూట్' ఒకటి నన్నతడివేపు లాగుతూండడం... ఇలా చాన్నాళ్లు గడిచింది. ఆ అలవాటు నాకు ఎంతగా మారిపోయిందంటే... ఎప్పుడైనా ఈ ముసిలాడు పుటుక్కున చచ్చిపోతే... మరణించిన మరుక్షణం ఈ భూగోళం అంతమైపోతుందని. ఏ ముహూర్తాన ఈ ఆలోచనొచ్చిందో కానీ... అది అంతింతై పెరిగిపోయింది. మనసులో ఫిక్సయిపోయింది. అతడు చచ్చిపోకూడదు అన్న సిద్ధాంతంతో మదినిండిపోయింది.

ఇక అప్పట్నుంచి 'కాజువల్'గా చూడ్డం కాదు. అక్కడికి రాగానే పనిగట్టుకుని చూడడం నా విధి, నా బాధ్యతలా తయారైంది. చిత్రంగా అతడికి మాత్రం ఇవేమీ తెలీదు. తనూ తన గోనె సంచి, పుస్తకాలూ, గొడుగూ...

వానాకాలం మొదలైంది. చల్లగాలులు వేసంగిని సాగనంపి ప్రపంచాన్ని సేదదీరుస్తున్నాయ్. ఉన్నట్టుండి మబ్బులు కమ్ముకోవడం... చినుకుల్లేవు ఒకేసారి దబదబా దబదబదబామంటో పెద్ద శబ్దాలతో వాన కచేరీ ప్రారంభం. మబ్బుల స్థాయినిబట్టి వాన సమయం నిర్ధారితమౌతోంది. ఆవేళ ఆఫీసులో వుండగా అనుకోకుండా మొదలైన వర్షం గంటయినా ఆగలేదు. బళ్ళోంచి పిల్లలు ఇంటి దగ్గర్లోనే బస్టాపులో దిగి వానకి ఎటూ వెళ్లలేక ఆగిపోతారని వాళ్లకోసమని ఆఫీసు నుంచి వానలోనే బయల్దేరేను. అంతకంటే ముఖ్యమైన మరో సరదా... వానలో తనివితీరా తడుస్తూ బైక్ మీద వెళ్లడం అదీ చాలా ఏళ్ల తర్వాత!!... బావుంది. వానింకా పెద్దదయింది. నేను 'ఆ' ముసిలాడి నివాస స్థానంవద్దకొచ్చాను- కొన్ని విషయాలు చాలా మామూలుగా జరిగినట్టనిపించినా నా జీవితంలో ఎంతో ప్రాముఖ్యతని సంతరించుకుంటాయ్. ఇలానే జరగాలని మనం అనుకోం... కానీ అది అలానే జరుగుతుంది. వాన ఇంకా పెరగడంతో రోడ్డుకి అటు ప్రక్క షెడ్డులో ఆగాన్నేను. అప్రయత్నంగా నా చూపులు అతడివేపు తిరిగాయి. అక్కడో అద్భుతం ఆవిష్కరించబడుతోంది... ఆ తురాయి చెట్టు కింద భోరుమంటోన్న వర్షంలో ముద్దగా తడుస్తున్నాడతను. తన గోడును విప్పి గోనె సంచీ తడిచిపోకుండా పట్టుకున్నాడు.

తన కంబళీ గొర్రె పిల్లకి కప్పేసి, తను వానలో తడిసిపోతున్న గొల్లపిల్లాడికిమల్లే అపురూపంగా కనిపించాడతను. ఏముండి వుంటుందా గోనె సంచీలో... నాకు తెల్సినంతవరకూ రెండోమూడో పుస్తకాలు... వాటికే ఆ వృద్ధుడికి అంత శ్రద్ధా?! నాకు నమ్మబుద్ధికాలేదు. కొంపదీసి అదేదో సినిమాలో, బిచ్చగాడు చనిపోయాక అతడి దగ్గరున్న జోలె తిరగేస్తే వందలకొద్దీ

డబ్బులు గలగలమంటో రాలతాయి... అలాగే ఇతడు కూడబెట్టిన డబ్బుగానీ వుండివుంటుందా?! ఆర్థిక సంబంధాలలో కూరుకుపోతూ కొట్టుకుపోయే నాకు అంతకన్నా ఆలోచన రాకపోవడంలో ఆశ్చర్యం ఏవుంది?

వాళ్లమ్మ వద్దంటున్నా వినకుండా ఓ పిల్లాడు నేనున్న షెడ్డులోంచి చెంగున రోడ్డుమీదికి దూకేడు. గిరగిరా తిరగడం మొదలెట్టాడు. కంగారుగా వాళ్లమ్మ వాణ్ని వెనక్కిలాక్కొచ్చి దబదబా నాలుగు దెబ్బలేసేసింది. ఎందుకన్నాను ఆవిడని ఆపుతూ... వానలో తడిస్తే జలుబూ ఆపైన్యుమోనియా వచ్చేస్తాయంట... ఇంగ్లీషులో చెప్పింది.

నవ్వాలో, నిజమేననాలో, డిప్లమేటిక్‌గా నిలబడాలో తెలీలేదు నాకు.

అప్పటికే ముద్దగా తడిచిపోయివున్నాను నేను. నాకంటే ఎక్కువగా ఆ వృద్ధుడు ఉన్నట్టుండి నాకో అయిడియా వచ్చింది... ఆ ముసిలాడిని ఇంటర్వ్యూచేయాలని. ఆ ఊహే గొప్పగా అనిపించింది. అతణ్ని నేనేమని ప్రశ్నించగలను...!!

ఎలానూ వాన కురుస్తోంది. పిల్లల్ని మా ఆవిడ (గొడుగులతోబాటూ) వచ్చి తీసికెళ్లే వుంటుంది... నన్ను తిట్టుకుంటూ. ఈ ముసిలాడేమో తన వింత (?) చేష్టలతో నాలో ఒక అనుభూతిని రగిల్చేడు. దాంతో ఇప్పుడీ ఇంటర్వ్యూ ప్రహసనం మనసులో మొదలయిందిలా...

"మీ... పేరు?"

"...-"

"ఊరు"

'...'

"మీరేం చదువుతూ వుంటారు?"

"......"

"ఇంత గొప్పగా చదువుకున్న మీరు ఇలా రోడ్డు మీద??"

అతడు నవ్వుతాడు బహుశా!!

ఇప్పటి యువతపై మీ అభిప్రాయం.

"......"

"ఈ యువతరానికి మీర్చి సందేశం"-తో ఆ ఇంటర్వ్యూ ముగుస్తుంది. నాకు జర్నలిజం తెలీదు. ఇంటర్వ్యూ చేయడమంటే ఎలానో తెలీదు. కానీ మీడియా పుణ్యమాని ఇలాంటి అయిడియాలు. యువ తరం అనగానే నాలో మరో అనుమానం... ఈ వృద్ధుడు బహుశా స్కాలరై వుండి ... రిటరై... తన పిల్లల నిరాదరణతో... ఇలా ఒంటరిగా... బహుశా ఇది గానీ నిజమైయుంటే... వాన తగ్గుముఖం పట్టింది. చిందరవందర వాతావరణంలో ఎవరి బాగోగులు వాళ్లు చూసుకోవడం మొదలైంది. అతడు మాత్రం తన గొడుగుని సంచీ తడవకుండా జాగ్రత్త పడుతూనే వున్నాడు. ఇంతసేపూ అంత వానలో ఆగకుండా తడిసిన అతడికి జలుబూ, తర్వాత న్యుమోనియా ఆపై మరణం... అవునూ అతడు చచ్చిపోతే!! ఎంత తెలీకుండానయినా... ఇందాకటి పిల్లాడి తల్లి మాటలు నా మనసులో అంత దారుణంగా నాటుకున్నాయ్. ఎందుకో అప్రయత్నంగా ఒళ్లు జలదరించింది. అతడు చనిపోవడం, భూప్రళయం రావడం ఒకసారేనని మరోసారి భయం ఆవరించింది.



నమ్మకాలు ఎప్పుడూ రబ్బిష్‌గానే వుంటాయ్! దానికి పునాది కేవలం మనం ఎంత గాఢంగా నమ్ముతున్నామన్న దాని మీదే ఆధారపడి వుంటుంది. లాజిక్ వుండదు. ఒకవేళ 'లాజిక్ వుందంటే అది అసలు నమ్మకమేకాదన్నమాట. అది దేవుడి మీదయినా, దెయ్యం గురించైనా... చివరికి సాటి మనిషి మీదయినా!!!

వాన వెలిసి... నింగిలో ఇంద్ర ధనసు విరిసింది. పిల్లాడి మనసులో కూడా విరిసినట్టుంది... చప్పట్లు కొడుతున్నాడు. నాలో ఓ వాన కురిసి వెలిసిన అనుభూతి.

"రోడ్డు ప్రక్క ప్లాట్‌ఫారం మీద అడుక్కుతినే దిక్కుమాలినోడు కూర్చునుండటమేంటీ? వాడు పోతే ప్రపంచానికి దిక్కులేక పోవడమేంటీ? ఇంతోటి విద్యావంతుడివి నువ్వు ఆ విషయంలో భయపడ్డవేంటీ!! అంతా రబ్బిష్" అన్నాడు రంగడు.

నమ్మకాలు ఎప్పుడూ రబ్బిష్‌గానే వుంటాయ్! దానికి పునాది కేవలం మనం ఎంత గాఢంగా నమ్ముతున్నామన్న దానిమీదే ఆధారపడి వుంటుంది. లాజిక్ వుండదు. ఒకవేళ 'లాజిక్ వుందంటే అది అసలు నమ్మకమేకాదన్నమాట. అది దేవుడి మీదయినా, దెయ్యం గురించైనా... చివరికి సాటి మనిషి మీదయినా!!!"అన్నాను.

"కథ చెప్పు... కంటిన్యూ!!" అన్నాడు ఓంబాబు.

నేను కొనసాగించేను.

"ఆ మర్నాడుదయం వరకూ నా రొటీన్‌లో పడిపోయేను. వాతావరణం బీభత్సంగా మారే సూచనలు చెప్పారు మళ్లీ టీవీలో. మళ్లీ కేంద్రీకృతమైన వాయుగుండం అర్ధరాత్రి నుంచీ దోబూచులాడుతోంది(ట). ఉండుండి వీస్తోన్న చల్లగాలి రివ్వున తాకుతోంది. కమ్ముకున్న మబ్బులు ఎప్పుడు కురుస్తాయో తెలీనట్టు గుంభనంగా వున్నాయి. పదింటికి ఆఫీసుకెళ్లేప్పుడు గుర్తొచ్చాడతను. నాకు నిన్న వాన సమయంలో ఎదురైన సంఘటనలో ఆ తల్లి అభిప్రాయంతో ఏకీభవించినట్లయితే ఈసరికే 'అతడు' జలుబు స్థాయిని దాటేసి న్యుమోనియా స్టేజికి ఎంటరైపోయుంటాడు. ఎందుకో తెలీదు, అర్జెంట్‌గా ఆ తల్లినీ ఆ పిల్లాడినీ చూడాలనిపించింది. హాయిగా సంతోషంగా ప్రపంచంలోని కల్మషం ఏమాత్రం ఎరుగని సంతృప్తితో వానలో తడవడంలోని అనుభూతిని గిరగిరా తిరుగుతూ అనుభవించిన ఆ పిల్లాడు... ఎంతో ఎంతో ముచ్చటగా అనిపించాడు. వెళ్లి వాణ్ని చూసి, వాడికి ఏ జలుబూ రాని విషయాన్ని వాళ్లమ్మకి చెప్పి, జలుబూ, జబ్బులూ మదిలోంచీ మనసులోంచీ తప్ప వానల్లో తడవడంవల్ల రావని చెప్పాలనిపించింది.

ఆలోచనల్లోనే ఆ వృద్ధుడి ప్రదేశానికొచ్చేను. అక్కడ నిండా జనం. గుమిగూడిన గుంపులోంచి ఒక్కొక్కరు ఒక్కొక్కమాట. గందరగోళంగా వుంది.

"సచ్చిపోయాడా!!!" అన్నారు రంగడూ, రాంక్రిష్ణా.

ఓంబాబు ఎందుకో నవ్వేడు.

"ఏం జరిగిందో మీరూహించలేరుగానీ! వినండి" అంటూ కొనసాగించేను.

(మిగతా 27వ పేజీలో)






(19వ పేజీ తరువాయి)

"ఆ ముసిలాడిని పోలీసులు తెల్లారగట్ల అరెస్టుచేశారు."

గోదారి ఉన్నట్టుండి ఆగినట్టు అనిపించింది.

డొక్కా సీతమ్మగారు కూడా విగ్రహంలో పజిలయి నట్టయింది.

మిత్రులు కాస్త ఉలిక్కిపడ్డారు.

గాలి నెమ్మదించింది.

నేను చెప్పడం కంటిన్యూ చేసాను.

తెల్లారుతోన్న సమయంలో అక్కడ దగ్గర్లో గోడల మీద విప్లవ నినాదాలు రాస్తోన్న యువకుడొకడు పోలీసుల కళ్లబడ్డాడు. వాడు పారిపోతూ పారిపోతూ వచ్చి చెట్టు క్రింద నిద్దరోతోన్న ఈ వృద్ధుడి ప్రక్కలో చేరాడు. వెదికి పట్టుకున్న పోలీసులు ఇద్దర్నీ అరెస్టు చేసి తీసుకుపోయారు. అక్కడ అరుగుమీద గోనె సంచీ, దాని మీద గొడుగూ అది ఎగిరిపోకుండా అతడుచేసిన చిన్న అమరిక... చిన్ని చిన్ని తాళ్లతో చెట్టుకూ అక్కడున్న రాళ్లకీ గొడుగుని కట్టేడతను.

ఆ విప్లవ నినాదాల యువకుడికీ అతడికీ ఏ సంబంధమో ఆరాతీసే పనిలో అప్పటికప్పుడే నగరంలోని మీడియా అన్ని హంగులతో అక్కడ సిద్ధమైపోయింది.

"త్రిషా! చెప్పు! అక్కడి పరిస్థితెలా వుంది"- టీవీస్టేషన్నుంచి రీడరు ప్రశ్న.

"రాంబాబూ! ఇక్కడంతా ఉత్కంఠ నెలకొంది. ఇన్నేళ్లుగా ఇక్కడ ప్లాట్‌ఫాం మీదే వుంటోన్న ఒక ముసిలాడు నక్సలైట్ల నాయకుడై వున్నా గమనించలేని స్థితిలో నగర పోలీసు వ్యవస్థ వున్నట్లు మనకి తేటతెల్లమవుతోంది. ఇక్కడ రాత్రి అరస్టయిన కుర్రాడితో బాటు విప్లవ సాహిత్యం కూడా దొరికింది. మరి కాసేపట్లో మరిన్ని వివరాలు లైవ్‌లో తెలియజేస్తాను... రాంబాబూ!" లైను కట్.

ఇంకాస్త ముందుకెళ్లిన మరో ఛానెల్ యాంకరమ్మని స్టూడియోనుంచి ప్రశ్నించాడు రీడర్... "పూజా! చెప్పు ఆ ముసిలాడు నక్సలైటా... టెర్రరిస్టా!!"

"క్రిష్ణా! అతడు నక్సలైటని కొందరూ టెర్రరిస్టని కొందరూ అంటున్నారు. ఇప్పుడు వాళ్ల అభిప్రాయాలు తెలుసుకుందాం లైవ్‌లో" వెంటనే టీవీలో కుడిప్రక్కన యస్‌యంయస్ పోలింగ్ మొదలైంది నక్సలయిటైతే ఒకటి, టెర్రరిస్టయితే రెండు, తెలీదు అంటే మూడు యస్‌యమ్‌యస్‌ల వరద మొదలైపోయింది. స్క్రీన్‌మీద ఇంటర్వ్యూలు.

"తానిక్కడ ప్రతీరోజూ రోడ్డు ఊడ్చేందుకొస్తుంటానని... ఆ ముసిలాడు చాలా ఏళ్లనుండీ తెల్సనీ... మౌనంగా ఉండేవాడనీ. అప్పుడప్పుడూ తనలోతనే మాట్లాడుకుంటూ ఉండేవాడ"నీ చెప్పింది అరుణ అనే మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు రోజంతా రోడ్డు మీద కల్మశాన్ని శుభ్రపరిచే ఆ అమ్మాయి మాటల్లో నిజాయితీ వుంది. నిజంగా వుండేందుకు అవకాశం వుంది. కానీ మసాలా లేదు.

మరో వ్యక్తి ముందుకొచ్చాడు... వాడు మామూలోడు కాదన్నాడు. అక్కడికి దగ్గరే వున్న ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ పిల్లల్తో మీటింగులు పెట్టేవాడని, వాళ్లకి విప్లవ భావాలు నూరిపోసేవాడని... ఇలాంటి వాటివల్లే గ్రెనేడ్ బాంబులు పేలుతున్నాయని... అతణ్ని ఉరితీయాలని... వగైరా వగైరా"... అది పేలింది. కెమేరాలన్నీ వెల్ఫేర్ హాస్టల్ వైపుకి తిరిగాయి. అక్కడి కుర్రాళ్లు ఎవరూ మాట్లాడ్డానికి కుదర్లేదు. వాతావరణంలో ఉత్కంఠ తారాస్థాయిని చేరుకుంది.

జిల్లా ముఖ్య పట్టణంలో అదీ పోలీసు ప్రధాన కార్యాలయానికి దగ్గర ఓ తీవ్రవాది(?) ఇన్నేళ్లుగా తిష్ట వేసుక్కూర్చున్నా ఎవరికీ తెలియకపోవడం ఎవరెవరి వైఫల్యమో ఒక్కో ఛానెల్ ఒక్కో విధంగా విశ్లేషించడం మొదలైంది.

ఇంతింత సంఘటనలూ ఇలా జరుగుతుండగా నగర శివార్లలో పెద్ద ఏక్సిడెంట్ జరిగినట్టు వార్తొచ్చింది. దానికితోడు రాత్రి అరెస్టయిన విప్లవ నినాదాల కుర్రాడిని పోలీసులు మీడియాముందుకు తెస్తున్నారని కబురు. క్షణాల్లో చెట్టు క్రింద జనం, కెమేరాలూ, అంతా అక్కడికి చేరుకున్నారు. నేనూ, చెట్టూ చెట్టు క్రింద గొడుగు, గొడుగు క్రింద గోనె సంచీ మిగిలేం. నేను చాలా 'కాజువల్'గా ఆ గోనె సంచీ తెరిచి అందులో పాలిథీన్ కవర్లో వున్న పుస్తకాల్ని

ఆ రాత్రంతా అతడి పుస్తకాలతో గడిపాన్నేను. ఆ వృద్ధుడి తాలూకు వికాసం నాలో వికసించడం తెలుస్తోంది. అతడు నాకు పూర్తిగా అర్థమయ్యేడు. అతడు చచ్చిపోడన్న నమ్మకం పూర్తిగా కలిగింది నాకు. అతడి పరోక్ష పరిచయం, అనుబంధం నాలో ధైర్యాన్ని నింపింది.

తీసుకున్నాను. అందులో నిజంగా పుస్తకాలే వుండడం నన్నాశ్చర్యపరిచింది. అతడింతకాలం అంత అపురూపంగా చూసుకుంటోన్న సంపద పుస్తకాలేనన్న ఊహ నిజమయ్యాక అతడి మీద ఇంకొంచెం ప్రేమ కలిగింది నాకు. ఆఫీసుకి ఫోన్‌లోనే శలవు చెప్పి ఇంటికొచ్చేశాను. నాతో ఆ పుస్తకాలు... కార్పొరేట్ పోరుడి పక్కన చెమటలు పట్టిన మట్టి మనిషి తాలూకు ముక్కు వాసనతో.

ఆ మర్నాడు కూడా వాతావరణం వాయుగుండం ప్రభావంతోనే వుంది. ప్రళయం రాలేదు కాబట్టి అతడింకా చచ్చిపోయి వుండడన్నమాట. దుఃఖ కారణం వెతుక్కుంటూ వెళ్లిన బుద్ధుడు ఆ క్షణంలో గుర్తుంచడం యాదృచ్ఛికం కాకపోవచ్చు.

ఆ రాత్రంతా అతడి పుస్తకాలతో గడిపాన్నేను. ఆ వృద్ధుడి తాలూకు వికాసం నాలో వికసించడం తెలుస్తోంది. అతడు నాకు పూర్తిగా అర్థమయ్యేడు. అతడు చచ్చిపోడన్న నమ్మకం పూర్తిగా కలిగింది నాకు. అతడి పరోక్ష పరిచయం, అనుబంధం నాలో ధైర్యాన్ని నింపింది. అతడు నాకు ఒక ఓదార్పు అయ్యేడు. అతడికి నమస్కరించాలనిపించింది. అతణ్ని అనుసరించాలనిపించింది.

ఉదయాన్నే నా కర్తవ్యమేమిటో కూడా నాకు తెలిసింది.

❊ ❊ ❊

పొద్దున్నే తయారై వెల్ఫేర్ హాస్టల్‌కెళ్లాను. అక్కడి పిల్లల్తో మాట్లాడాను. ఆ వృద్ధుడు అందర్లోకీ ఎక్కువగా ప్రేమించిన పిల్లాడిని వాకబు చేశాను. కళ్లనిండా వెలుగుతో వికాసవంతమైన నవ్వుతో, నిండైన అమాయకత్వంతో ఆ పిల్లాడు ముద్దొస్తున్నాడు. అతణ్ని దగ్గరికి పిలిచి ఆ పుస్తకాన్ని అందించాను. నువ్వు ఇంకా పెద్దయ్యాక ఈ పుస్తకాల గురించి ఇంకా ఇంకా బాగా అర్థమవుతుంది. చదువుతూనే వుండు... చదివిస్తూ వుండు అన్నాను. వాడు నిశ్చయంగా అవి అనుసరిస్తాడు. నేను అందిస్తున్నప్పుడు వాడు ఆ పుస్తకాల్ని అందుకుని గుండెలకి అదుముకున్న దృశ్యమే అందుకు సాక్ష్యం.

ఆ వృద్ధుడు కొనసాగిస్తోన్న ఉద్యమంలో నేనూ ఆ విధంగా పాలుపంచుకొని పరంపర ఆగిపోకుండా చేయగలిగినందుకు లోలోపల ఆనందపడ్డాను.

"ఉద్యమం అంటున్నావ్?" కొంపదీసి విప్లవ సాహిత్యమేనా?" అన్నాడు రాంక్రిష్ణ.

"ఉద్యమమే" అన్నాను ఓంబాబుగాడు మళ్లీ నవ్వేడు.

"ఇంతకీ ఆ ముసిలాడేమయ్యేడు బ్రతికేడా?!" అనడిగేడు రంగడు.

"చెప్పేడు కదరా! అతడు చనిపోడనీ! చచ్చిపోకూడదనాని!" వివరించాడు ఓంబాబు.

"నువ్ చెప్పరా! ఏమైందో?"

"రెండ్రోజుల తర్వాత అతణ్ని పోలీసులు వదిలేశారు- ఏమీలేదని నిర్ధారించుకుని. అతడు యథాప్రకారం తన చెట్టు క్రింద కూర్చున్నాడు. నాకు అతడితో మాట్లాడాలనిపించింది. కానీ ఎప్పట్లానే నగరానికి భయపడ్డాను. కానీ ఆ సాయంత్రం... అంటూ" ఆగేను.

"మళ్లీ ఉత్కంఠ! ఏం జరిగిందిరా బాబూ! చెప్పరా అంటున్నారు మిత్రులు.

"అతడు గాఢ నిద్రలో వున్నట్టు చెట్టు క్రింద పడుకున్న భంగిమలో వున్నాడు- అచ్చం శవంలా. అతడు చచ్చిపోయాడా అనిపించింది. కానీ దగ్గరికెళ్లాలంటేనే...!!??

"ప్రళయమైతే ఏరాలేదుకదా! అందుకని చచ్చిపోయుండడు" అన్నాడు రంగడు.

ఓంబాబుగాడు నవ్వేడు. రంగడు ఉడుక్కోలేదు. చీకటి చిక్కబడేలోగానే చంద్రుడు వెన్నెల వలతో దాన్ని బంధించేడు. అపురూపమైన వింత కాంతి గోదారి మీద ఊరి మీద పరుచుకుంటోంది. మిత్రులు ఎవరిళ్లకి వాళ్లు బయల్దేరాం.

❊ ❊ ❊

'అతడు' సంప్రదాయానికి 'సింబల్'ని ప్రతీకాత్మకంగా చెప్పిన విషయాన్ని అర్థంచేసుకున్న ఓంబాబుగాడు ప్రశంసా పూర్వకంగా నవ్వుతూ భుజంతట్టి కరచాలనం చేసాడు.

ఆ పుస్తకాలు ఏమిటని మిత్రులెవరూ అడగలేదు. వాళ్లకి నేను చెప్పనూ లేదు.

అవి పుస్తకాలన్నది మాత్రం అంతా ఒప్పుకున్నారు- ఎవరి అభీష్టం మేరకి వాళ్లు ఊహించుకుంటున్నారనుకుంటా.

నేను చెప్పనివన్నీ చెప్పకుండానే తెలుసుకున్నట్టున్నారు విగ్రహాల్లోంచి డొక్కా సీతమ్మగారూ, మదర్ థెరీస్సా ప్రేమగా ఆప్యాయంగా నవ్వుతున్నారు గోదారితోబాటూ. ★

రచయిత చిరునామా:
డా. యల్.కె.సుధాకర్,
9-453/2; సౌజన్యా బిల్డింగ్స్
గ్రామ పంచాయతీ ఎదురుగా రమణయ్యపేట,
కాకినాడ- 533 005.